# పాతాళానికి పట్టణ ప్రగతి

- పురపాలికలకు నిధులివ్వని రాష్ట్ర సర్కారు
- వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్లు.. ఎఫ్ఎస్‌టీపీల నిర్మాణాలు బంద్
- బిల్లులు ఇస్తేనే పనులు చేస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల హెచ్చరిక



హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలనే కాదు పట్టణాలకూ నిధుల్లేవంటున్నది. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. పట్టణ ప్రగతి కింది చేపట్టిన వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్లు, ఎఫ్ఎస్‌టీపీలు, మోడ్రన్ దోబీఘాట్‌లు లాంటి కీలక పథకాలకు నిధుల విడుదలపై చేతులు ఎత్తేసింది. ఇప్పటికే సగానికిపైగా పూర్తి అయిన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. పనులు ఆగిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు కొంతలో కొంతైన విడుదల చేయాలని మున్సిపల్ ఈఎన్సీ, ఇతర ఇంజినీరింగ్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే తదుపరి పనులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఎక్కడి పనులకు అక్కడ బ్రేక్ పడ్డాయి.

పట్టణాల రూపు రేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత సీఎం కేసీఆర్, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కే తారక రామారావులు పట్టణ ప్రగతి కింద ప్రతి నెల పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాలకు రూ.148 కోట్లు విడుదల చేశారు. కేంద్రం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చింది. దీంతో తెలంగాణ పట్టణాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. అనేక అవార్డులను సాధించాయి. ఇతర దేశాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి ఇక్కడ పథకాలు చూసి వెళ్లారు. దేశమే అబ్బురపడే విధంగా తెలంగాణ పట్టణ ప్రగతిని నిలిచింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పైసా నిధులు ఇవ్వడం లేదు. దీంతో మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణాలు, ఎఫ్ఎస్‌టీపీలు, ట్రీ పార్కులు, ఓపెన్ జీమ్‌లు ఇలా అనేక పథకాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. చెత్త సేకరణపై అధికారుల పర్యవేక్షణ లేక చెత్త వాహనాలు నిర్వహణ సరిగా ఉండడం లేదు. ఈ సారి ఎండలు తీవ్రంగా ఉండటం, హరితహారం మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో అనేక చోట్ల ఎండిపోతున్నాయి. ఇక సమీకృత మార్కెట్లు కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కానీ కొన్ని చోట్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. 141 మోడ్రన్ దోభీ ఘాట్‌లకుగాను దాదాపుగా 10 వరకు మోడ్రన్ దోభీ ఘాట్‌లు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆఖరు ప్రయాణం సంతృప్తిగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి పట్టణంలో హైదరాబాద్‌లోని మహాప్రస్థానం తరహాలో వైకుంఠధామాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇవేవి ముందుకు కదలడంలేదు.

## మాచర్ల ఎమ్మెల్యేకు బిగిసిన ఉచ్చు

- ఈవీఎం ధ్వంసం కేసులో ఈసీ సీరియస్
- సంగారెడ్డి జిల్లాలో అనుచరులు, కారు స్వాధీనం

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ)/సంగారెడ్డి: ఈవీఎం, వీవీ ప్యాట్ ధ్వంసం కేసు విషయంలో ఏపీలో వైసీపీకి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చుట్టూ ఉచ్చు బిగిసింది. సీఈవో ఆదేశాల మేరకు పిన్నెల్లి అరెస్టుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఐపీసీ, ఆర్పీ, ప్రజాప్రాతినిధ్య చట్టాల కింద 10 సెక్షన్ల కింద వివిధ కేసులను నమోదు చేశారు.పిన్నెల్లిని ఈ కేసులో ఏ1గా చేర్చారు. పరారీలో ఉన్న ఎమ్మెల్యే కోసం పోలీసులు బుధవారం ఉదయం ఆంధ్రా, తెలంగాణ పోలీసులు సంగారెడ్డి జిల్లాలో విస్తృతంగా గాలించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని రుద్రారం వద్ద పోలీసుల తనిఖీల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి డ్రైవర్, మరికొంత మందిని ఆంధ్రా పోలీసులు అదుపులోకి తీసుకొని, కారును స్వాధీనం చేసుకున్నారు. వీరిని కందిలోని సీసీఎస్ పోలీస్టేషన్‌లో విచారించిన అనంతరం హైదరాబాద్ తరలించారు. ఎమ్మెల్యే ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ అతిథిగృహంలో ఉన్నాడని తెలియడంతో ఆంధ్రా పోలీసుల అక్కడ తనిఖీలు చేయగా, అక్కడ లేకపోవటంతో వెళ్లిపోయా రు. పోలీసుల నుంచి తప్పించుకుని హైదరాబాద్ వైపు వెళ్తున్న పిన్నెల్లిని పోలీసులు మార్గమధ్యంలో అరెస్టు చేసినట్టు తెలుస్తున్నది. పిన్నెల్లి అరెస్టును ఆంధ్రా పోలీసులు కానీ, సంగారెడ్డి జిల్లా పోలీసులు కానీ ధ్రువీకరించలేదు.

### 85 మందిపై హిస్టరీ షీట్: ఏపీ డీజీపీ

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లలో 85 మంది నిందితులపై హిస్టరీ షీట్ తెరిచామని ఆ రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. ముగ్గురిపై పీడీ యాక్టు, మరో ఇద్దరి బహిష్కరణకు సిఫార్సు చేశామని తెలిపారు. ఎన్నికల ముందు రోజు నమోదైన కేసు ల్లో 1,522 మందిని గుర్తించామని, ఎన్నికల రోజు నమోదైన కేసుల్లో 2,790 మం దిని గుర్తించామని తెలిపారు. ఎన్నికల అనంతరం నమోదైన కేసుల్లో 356 మందిని గుర్తించామని డీజీపీ తెలిపారు. కొందరిని అరెస్టు చేశామని, మరికొందరికి 41 ఏ సీఆర్పీ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

## సీఐపై కేసు చట్టబద్ధమే

- 2012లో సీజేఎం కేసు నమోదుపై హైకోర్టు తీర్పు
- అడ్వకేట్ కమిషనర్లు పబ్లిక్ సర్వెంట్లు అని వెల్లడి

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన వీ సురేశ్‌పై 2012లో చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) నమోదుచేసిన కేసు సరైనదేనని హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయం 2012, డిసెంబర్ 21న కాకతీయ ఉత్సవాల ప్రారంభానికి వస్తున్న నాటి సీఎం కాన్వాయ్‌ని అడ్డుకొనేందుకు కుట్ర పన్నారని నాటి టీఆర్ఎస్ కార్యకర్తలు జే రమేశ్, వాసుదేవరెడ్డి, దర్శన్‌సింగ్, అనిల్, సంకు నరసింగరావు, వైరాజేంద్రయాదవ్‌తోపాటు మరికొందరిని సీఐ సురేశ్ అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచకపోవడంతో..వారి స్థితిగతులను తెలుసుకొనేందుకు ఒక అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటుచేసి, తనిఖీకి వారంట్ జారీ చేయాలని కోరుతూ.. అబ్దుల్‌నబీ అనే న్యాయవాది వరంగల్ సీజేఎం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఎం.. న్యాయవాదులు కే రమేశ్, ఎం రవీందర్‌ను అడ్వకేట్ కమిషనర్లుగా నియమించారు. కోర్టు ఆదేశాలతో ఈ ఇద్దరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా సీఐ సురేశ్‌తోపాటు ఇతర పోలీసులు వారిని అడ్డుకోవడమే కాకుండా స్టేషన్ వదిలి వెళ్లాలని ఒత్తిడి చేశారు. దీంతో అడ్వకేట్ కమిషనర్లు తాము ఎదుర్కొన్న పరిస్థితులను నివేదిక రూపంలో సీజేఎంకు తెలియపరిచారు. అదేరోజు రాత్రి 10.55కు సీఐ సురేశ్ తమ అదుపులో ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలను సీజేఎం కోర్టులో హాజరుపరిచారు. అప్పటికే అడ్వకేట్ కమిషనర్ నివేదిక అందుకున్న సీజేఎం సీఐ సురేశ్‌పై సుమోటోగా కేసు నమోదుచేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ సురేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు.. కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్లు పబ్లిక్ సర్వెంట్లని పేర్కొన్నది. వారిని అడ్డుకోవడం అధికారిక విధులను ఆటంకపరచడమేనని స్పష్టంచేసింది. అడ్వకేట్ కమిషన్‌ను అడ్డుకున్న సీఐపై చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కేసు నమోదు చేయడం చట్టబద్ధమేనని స్పష్టంచేసింది.

- గుట్టలో ముగిసిన లక్ష్మీనరసింహుడి జయంత్యుత్సవాలు



*యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతోపాటు పాతగుట్ట పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 20న ప్రారంభమైన నృసింహుడి జయంతి ఉత్సవాలు బుధవారం రాత్రి నృసింహ ఆవిర్భావంతో ముగిశాయి. ఈ వేడుకలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. – యాదగిరిగుట్ట*

## కేంద్ర ప్రాజెక్టుల అమలుపై పర్యవేక్షణకు సింగిల్ నోడల్ ఏజెన్సీ

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్ర పథకాల అమలు, నిధులు విడుదల వంటి అంశాల పర్యవేక్షణ కోసం సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ)ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం రెండు వేర్వేరు జీవోలను విడుదల చేశారు. ఎస్ఎన్ఏ తరహాలో 'అకౌంట్స్ రెండింగ్ యూనిట్' (ఏఆర్‌యూ) ఏర్పాటుకు మార్గదర్శకాలను జారీ చేశారు. డిప్యుటేషన్ పద్ధతిలో 9 మంది ఉద్యోగులను నియమించుకుని ఎస్ఎన్ఏ-స్పార్స్ విధానంలో వెంటనే 'అకౌంట్ రెండింగ్ యూనిట్'ను ఏర్పాటు చేయాలని ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

## అలాట్‌మెంట్లలో అవకతవకలు

- చిత్రపురికాలనీ ఫ్లాట్ల కేటాయింపులో వసూళ్లు
- హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడి అరెస్ట్
- కమిటీ సభ్యులపైనా కేసు నమోదు

శేరిలింగంపల్లి, మే 22 : చిత్రపురికాలనీలోని ఫ్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదు మేరకు 'తెలుగు సినీ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ను రాయదుర్గం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ చిత్రపురికాలనీలో ఫ్లాట్లను అర్హులకు కేటాయించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటైంది. కాగా తమకు చేసిన అలాట్‌మెంట్‌ను రద్దుచేసి వేరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ను అరెస్టు చేయడంతోపాటు కమిటీ సభ్యులు పరుచూరి వెంకటేశ్వర్‌రావు, వినోద్‌బాల, చంద్రమధు, కాదంబరి కిరణ్, మహానంద రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేశ్, మరికొందరిపై 420, 120బీ, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

### ఫిర్యాదుల వెల్లువ

రూ.12 లక్షలు చెల్లిస్తే ఫ్లాట్‌ను తనకు బదులు మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారని మార్చి 7న తోటశ్రీ పద్మ రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను రూ.4లక్షలు చెల్లించిన తర్వాత సదరు అలాట్‌మెంట్‌ను కమిటీ సభ్యులు రద్దు చేసి డబ్బులు తిరిగి ఇవ్వలేదని మార్చి 20న యనమల మాధవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయశ్రీ, శ్రావణ్ కుమార్, కాట్రగడ్డ రవితేజ, బక్కి విద్యతో పాటు మరికొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. డబ్బులు చెల్లించినా ఫ్లాట్ల అలాట్‌మెంట్ రద్దయిన బాధితుల సంఖ్య దాదాపు 150 వరకు ఉంటుందని, ఒక్కో బాధితుడి వద్ద సుమారు రూ.4 లక్షల నుంచి రూ.40 లక్షల దాకా వసూలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. హౌసింగ్ సొసైటీ సభ్యులు అనర్హులకు ఇండ్లు కేటాయించి కోట్ల రూపాయల అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. చిత్రపురికాలనీ ఫ్లాట్ల అలాట్‌మెంట్ కుంభకోణంలో అధికారుల పాత్ర, అర్హుల వద్ద వసూలు చేసిన డబ్బు ఎటు వెళ్లిందనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



## బీఆర్ఎస్ నేతలపైనే ఉల్టా కేసులు

- ఓఆర్ఆర్ దాడి ఘటనలో ముందుగా బీఆర్ఎస్ ఫిర్యాదు
- అయినా, కాంగ్రెస్ ఫిర్యాదుపైనే పోలీసుల తొలి కేసు

ఘట్‌కేసర్, మే 22: బీఆర్ఎస్ మేయర్, కార్పొరేటర్ల కిడ్నాప్‌కు సినీ ఫక్కీలో ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేస్తే బాధిత నాయకులపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. అధికార పార్టీ ఒత్తిడితోనే పోలీసులు ఈ కేసు నమోదు చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 19న పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, మరికొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్ల కిడ్నాప్‌నకు కాంగ్రెస్ నాయకులు యత్నించారు. ఓఆర్ఆర్‌పై కార్లను ఛేజ్ చేస్తూ నానా హంగామా సృష్టించారు. ఈ ఘటనపై ముందుగా బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. కానీ, పోలీసులు కేసు నమోదు చేయలేదు. కాగా, పెద్దఅంబర్‌పేట్‌లో ఒక ఫంక్షన్‌కు హాజరై ఓఆర్ఆర్‌పై అంబర్‌పేట్ నుంచి పీర్జాదిగూడకు డిప్యూటీ మేయర్ శివకుమార్, శ్రీధర్‌రెడ్డి, చంద్రారెడ్డి మరో 10 మందితో కలిసి తిరిగి వెళ్తుండగా తమను బీఆర్ఎస్ నాయకులు అడ్డగించి, తమపై దాడికి ప్రయత్నించారని కార్పొరేటర్ అమర్‌సింగ్ ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో వెంటనే మేయర్ వెంకట్‌రెడ్డితోపాటు హరిశంకర్‌రెడ్డి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులపై వెంటనే కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఓఆర్ఆర్‌పై పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లను కిడ్నాప్ ఘటనపై బీఆర్ఎస్ నేత రఘువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కాంగ్రెస్ నాయకులైన అమర్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, పరస్పర ఫిర్యాదులు రావడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.


